


"ఏదో ఒకటి చేసితీరాలి!" అన్నాడు శాస్త్రి తానొక నిశ్చయానికి వచ్చినట్లు. 'అమెచ్యూరు నాటకసంఘమొకటి స్థాపిద్దాం!' అని ప్రతిపాదించాడు ఈమధ్యనే రాజకీయ సన్యాసం చేసిన భాస్కరం.

మాకు కాస్తో కూస్తో రంగస్థలానుభవం వుండడంవల్ల ఈ ప్రతిపాదన మమ్మల్ని ఆకర్షించింది. కానీ నాటకసంఘమేసికి హార్మోనియం, తబలా, నటీమణులు, రాజపోషకులు, మహారాజ పోషకులు వగైరా సామగ్రి అవసరం గనకనూ, సదరుసామగ్రి మాకు అలభ్యం గనకనూ ఈ తీర్మానం వెంటనే వీగిపోయింది.

ముగ్గురం చాలాసేపు ఆలోచించాం. లోకానికి ప్రజలకు ఏం ఉపయోగపడకుండా వృథాగా తిరిగేకంటే ఏదోఒకటి చేసితీరాలి! ఇదీ మా ముగ్గురికీ కలిగిన ఏకైక సమస్య. అయితే ఏం చెయ్యాలి? స్వార్థంతోనూ, ఈర్ష్యతోనూ మురిగి తేలుతున్న రాజకీయ ఉద్యమాలలోకి వెళ్లి పని చెయ్యడం మాలో ఎవరికీ ఇష్టంలేదు. వృథాగా కాలంగడపం అసలే ఇష్టంలేదు. అయితే ఏం చెయ్యాలి? కాఫీహోటలు దగ్గరనుంచి కళారాధన వరకూ మేము చర్చించని విషయమంటూ లేదు. కానీ చివరకేమీ తేలలేదు. మధ్యాహ్నం అవడంవల్ల యిళ్ళకుపోయి భోజనాలుచేసి తిరిగి నా గది చేరుకున్నాం. సాయంత్రం వరకూ చర్చ సాగుతోనేవుంది. చివరకు నాకొక చక్కని ఉపాయం తట్టింది. అనేక తర్జనభర్జనలు జరిగిన మీదట ముగ్గురం దానిని ఏకగ్రీవంగా ఆమోదించాం. అదే వయోజనవిద్యా ఉద్యమం. మన ప్రజలందరూ అక్షరాస్యు లయినట్టయితే పౌరస్వత్వపు హక్కులను సరిగా వినియోగించగలరనీ ఏ రాజకీయపక్షాలూ చెయ్యలేని పని మనం చేసినవాళ్ళం అవుతామనీ చాలా గర్వపడ్డాం. మన వయోజనులంతా విజ్ఞానవంతులయిన తర్వాత చీకటిబజారులూ, తప్పుడు సాక్ష్యాలూ అతిసులువుగా నిర్మూలించవచ్చునని కూడా సంతోషించాం. అయితే ఏపద్ధతిని చదువుచెప్పాలీ అని చర్చించాం. చిన్నపిల్లలకు చదువుచెప్పడానికీ పెద్దవాళ్ళకి చదువుచెప్పడానికీ చాలా తేడా ఉంది గనక మేమొక కొత్తపద్ధతిని అవలంబించడానికి నిశ్చయించాం. అక్షరాలు దిద్దించేందుకూ, ఆరోగ్యశాస్త్రంచెప్పేందుకు నేను; చరిత్రా, రాజకీయాలు చెప్పేందుకు శాస్త్రి; పేపరు చదివి చెప్పేందుకు, ఊళ్ళోతిరిగి వయోజనుల్ని పాఠశాలకు చేర్పించేందుకు భాస్కరం అంగీకరించాం. అయితే మొట్టమొదట పాఠశాలలో చేర చదువుకునేందుకు వయోజనులు కావాలి. కొద్దిగా ఆర్థిక సహాయం కావాలి.

భాస్కరం ఆరోజు మొదలు వయోజనులకోసం ఊళ్ళో తిరగటం ప్రారంభించాడు. నాలుగు రోజులు గడిచింది. ఆరోజు ఉదయం శాస్త్రి, నేనూ వయోజనవిద్యను గురించి వ్యాసాలున్న పత్రికలు తిరగెయ్యటం ప్రారంభించాం. ఈ సమయంలో భాస్కరం గదిలో ప్రవేశించాడు ఏదో గొప్ప ఘనకార్యం చేసినవాడిలా మొఖంపెట్టి జేబులోంచి కాగితం ఒకటి తీశాడు.

'ఎంతమందిని జేర్పించావు?' అని అడిగాడు శాస్త్రి.

నాటకంలో మొదట పాత్రలను పరిచయంచేసినట్టు ఇలా చదవటం ప్రారంభించాడు భాస్కరం.

‘ఒకటి-వెంకన్న:ఎఱ్ఱగా పొట్టిగా వుంటాడు-బొద్దు మీసాలు - వయస్సు ముప్ఫైరెండు - ఒక మిల్లులో కూలీ-రోజుకు కూలి రూపాయిన్నర.

రెండు-ఎల్లయ్య:వ్యవసాయ కూలీ - సన్నంగా పొడుగ్గా వుంటాడు-కూలి సమయానుకూలం.

మూడు-చలమయ్య:నల్లగా బలంగావుంటాడు-వృత్తి, ఒక షాహుగారుదగ్గర మూటలు మొయ్యడం-రోజుకు కూలి రూపాయి బేడా ప్లస్ కానీ చుట్టలు.’

‘అదంతా తరవాత చూద్దాం. మొత్తం ఎంతమందో చెప్పు!’ అన్నాను.

‘ప్రస్తుతం పదిమంది చేరారు. వారంరోజుల్లో మరొక ఇరవైమంది చేరటానికి మాట యిచ్చారు’ అన్నాడు సగర్వంగా.

ఇప్పటికి ఒక సమస్య పరిష్కారమయింది. ఇక ఆర్థికసమస్య ఉంది. గ్రామానికల్లా డబ్బున్నవాడు, ఒక రాజకీయపక్షానికి అధిపతి, పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు అయిన సుబ్బయ్యగారు ఈ విషయంలో సహాయం చెయ్యవచ్చునని ఆశించాం. ఒకనాటి ఉదయం ఆయన యింటికి వెళ్ళాం. ఆయన, మమ్మల్ని కూర్చోమని, ‘ఏమిటి విశేషం?’ అని అడిగారు. మేము విషయమంతా చెప్పాం. అంతా విని నవ్వి ఆయన ‘సాధ్యంకాని పనులన్నీ నెత్తిమీద పెట్టుకోవడం యెందుకోయ్! హాయిగా ఏ గాంధీనిధో వసూలు చెయ్యకూడదూ?’ అని అనేశారు. సాధ్యమవుతుందనీ దానికి అన్నీ కొత్త పద్ధతులు అవలంబిస్తున్నామనీ ఆయనకు నచ్చచెప్పాం. ప్రస్తుతం ఎంతమంది చేరారని అడిగారు. వెంటనే భాస్కరం తన కాగితంతీసి చదివి వినిపించాడు. వినగానే ఆయన ఒక ఉరుము ఉరిమి, ‘ఇంతాచేసి మీరు వీళ్ళకా చదువు చెపుతున్నది? ఇంకా యెవరికో అనుకున్నాను. మొత్తానికి మంచి వాళ్ళనే సంపాదించారు...అలాటి వెర్రి మొర్రి వేషాలు వెయ్యక హాయిగా యింటిలో కూర్చోండి. అంతగా మీకు చదువు చెప్పాలని వుంటే మా యింట్లో నలుగురు పిల్లలున్నారు మీకు తోచినప్పుడల్లా వచ్చి చెప్పిపోతూ వుండండి. తెలిసిందా?’ అన్నాడు. నిరుత్సాహంతో మా గది చేరుకున్నాం.

‘వీడు శుద్ధ చీకటి బజారువాడురా! నేను కమ్యూనిస్టుగా వున్నప్పుడు వీడికీ నాకూ చాలా ఇదిగా వుండేదిలే!’ అన్నాడు భాస్కరం.

‘సహాయం చెయ్యకపోతే మానె - ఈయన కూడా మన వయోజన పాఠశాలలో చేరితే బాగుండును’ అన్నాడు శాస్త్రి.

‘చదువురాదా?’ అన్నాను ఆశ్చర్యంగా.

‘ఈ మధ్యనే సంతకం చెయ్యడం నేర్చుకున్నాడు’ అన్నాడు భాస్కరం.

ఒక సుముహూర్తంలో పేటలో దేవాలయం అరుగుమీద వయోజన పాఠశాల ప్రారంభించాం. సమయం రాత్రి ఎనిమిదిగంటలనుండి పదిగంటల వరకూను. విద్యార్థులందరూ చదువు విషయంలో చాలా ఉత్సాహం చూపించసాగారు. మేం చెప్పిన ప్రతి విషయానికీ వాళ్లు యెదురు చెప్పటం సాగించారు. అంతా లోకానుభవంతో తల నెరిసిన వాళ్లు. మేం ఉత్త పుస్తకజ్ఞానం కలవాళ్ళం. మేం వాళ్ళకు చెప్పేవాటికంటే మేమే వాళ్ళదగ్గరనుంచి నేర్చుకోవలసినవెన్నో ఉన్నవి.

మొదట అక్షరాలు దిద్దించి, తరవాత ఆరోగ్యశాస్త్రం చెప్పటాని కుపక్రమించాను. బొమ్మ చూపిస్తూ ‘ఇదిగో! చూశారూ - ఇది మానవ శరీరం. దీని నెంతో జాగ్రత్తగా కాపాడుకోవాలి. మనం ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా యిది రోగాక్రాంతం అవుతుంది. మన పరిసర ప్రదేశాలను శుభ్రంగా వుంచుకోవాలి. ఇంటిలోకి గాలి ధారాళంగా వచ్చేటట్టుండాలి. రోజూ స్నానంవల్ల దేహాన్ని పరిశుభ్రం చేసికోవాలి. నిలవ పదార్థాల నెప్పుడూ తినకూడదు. ఏపూట కాపూటే వండుకు తినాలి...’

వెంటనే చలమయ్య అందుకొని, ‘బాబూ రూపాయికి అడ్డెడు బియ్యంలేవు ఏ పూటకాపూట వండుకు ఎలా తింటాం, ఏదో ఒక పూటే వండుకు తింటాం కానీ!’ అన్నాడు. కొంచెం బాధపడి తిరిగి ప్రారంభించాను. ‘పాలూ పళ్లూ బలమైనవీ ఆరోగ్యమైనవీని.’

‘అయ్యా మీలాంటి మా రాజులికి కాని మాకెక్కడ దొరుకు తియ్యా బాబూ!’ అన్నాడు ఎల్లయ్య. భాస్కరంఅందుకొని ‘మా వేషభాషల్ని చూసి మేమెంతో డబ్బున్న వాళ్ళం అనుకుంటున్నారేమో, మేమూ మీలాంటివాళ్ళమేనోయ్ ఎల్లయ్యా!’ అన్నాడు.

నేను తిరిగి ప్రారంభించాను. 'ఏదైనా డబ్బు చేస్తే వైద్యుడి దగ్గరికివెళ్లి తగిన చికిత్సచేయించకుండా సొంత వైద్యంచేసి నిష్కారణంగా మనిషి ప్రాణం తీస్తారు అలా ఎప్పుడూ చెయ్యకూడదు. వైద్య సహాయం తప్పని సరిగా తీసికోవాలి.'

'అనకూడదు కాని బాబూ ! ధర్మాసుపత్రుల్లో ధర్మం యెక్కడుందండీ ? గవర్నమెంటోరు యిచ్చిన మందులన్నీ ఈ డాక్టర్లు డబ్బున్నవాళ్ళకు దారపోత్తారే కాని మమ్మల్ని సూత్తారా బాబూ !— మొన్న నా సిమ్హాద్రి పెళ్లానికి పేణం మీద కొత్తే ధర్మాసుపత్రికి తీసికెళ్ళాం. మాకేసి చూసే నాత్తే లేరక్కడ. దాని పేణం కాంతా ఆస్పత్రి ముందే పోయింది.' అని నిట్టూర్చాడు వెంకన్న.

'ఏ గెచ్చాకో పుచ్చాకో వేసుకోకపోతే మాకు మందు లెక్కడినుంచి వత్తాయి బాబూ !' అన్నాడు పుల్లయ్య.

వాళ్లు యెదుర్కొనే ప్రతి విషయానికీ నిరుత్తరుడనౌతూ మరి కొంతసేపు పాఠం చెప్పి చాలించాను. తరవాత శాస్త్రి చరిత్ర చెప్పటం ప్రారంభించాడు. 'ఇదిగో - ఇది మనదేశం. ఇవి హిమాలయా పర్వతాలు. ప్రపంచంలోకల్లా ఎత్తయినవి. మన దేశాన్ని రత్నగర్భ అంటారు ఇతర దేశస్థులు. వాళ్ళ ఉద్దేశం మనదేశంలో ప్రజలు తిండికీ బట్టకూ కొరత లేకండా డబ్బుతో మునిగి తేలుతుంటారని. వాళ్ల మాటల్లో కొంత నిజం లేకపోలేదు. మన దేశం నిజంగా రత్నగర్భే ! కానీ ఆ రత్నాలను ప్రజాసామాన్యానికి అందుబాటులో లేకుండా బహుకొద్దిమంది మూటలు కట్టుకు కూర్చున్నారు. అయితే ఈ కోటీశ్వరులంతా ఆదినుంచీ ఉన్నారా అని మీకు సందేహం కలగవచ్చు. కాబట్టి మీకు మనదేశపుచరిత్రంతా మొదటినుంచీ చెబుతాను.

'ఆదిమ సమాజంలో ధనవంతులు ధనహీనులు అనే వర్గాలులేవు. ఆ సమాజం సమష్టి కుటుంబం వంటిది. శరీరంలో శక్తివున్న ప్రతివాడూ కష్టపడి పనిచేసేవాడు. వృద్ధులూ పిల్లలూ వాళ్ళమీద ఆధారపడివుండేవారు. స్త్రీలుకూడా వొళ్లు వంచి పనిచేసేవారు. వాళ్లుచేసే పనేమిటని మీరడగొచ్చు. ఆహారం కోసం జంతువుల్ని వేటాడ్డమే వాళ్లుచేసే ముఖ్యమైన పని. వాళ్లు శుద్ధ అనాగరికులు. పచ్చి మాంసం తినేవారు. వర్షకాలంలో కొండ గుహల్లోనూ మిగత కాలంలో చెట్ల క్రిందా నివసించేవాళ్లు. వాళ్ళకి ఒక నాయకుడుండేవాడు. అతను యిప్పటి నాయకులలా డబ్బున్నవాడు కాదు. అతను మిగతావాళ్ళ అభిప్రాయాన్ని బట్టినడుస్తుండవలసిందే. అంటే అది ప్రజాప్రభుత్వం కాని. డబ్బున్నవాళ్ళ ప్రభుత్వం కాదన్నమాట!'

మధ్యనందుకొని "మీ చాదస్తంకాని, డబ్బున్నవాళ్ళకి కాకపోతే మీకూ మాకూ ఎప్పుడైనా వొత్తదంటండీ ప్రభుత్వం ?" అన్నాడు సోములు.

'అనకూడదు గాని బాబూ! యీవూళ్లో వున్న పెద్దపదవులన్నీ ఆ సుబ్బయ్యగారియ్యే కాదటండీ ! ఆయన డబ్బుచూసికాకపోతే ఆయన చదువూ గేనం చూసి వచ్చినయ్యటండీ పదవులు ? " అన్నాడు వెంకన్న తన చిరిగినచొక్కా సర్దుకుంటూ.

వెంకన్న మాట్లాడే ప్రతిమాటకు అవసరమైనప్పుడల్లా 'అనకూడదు కాని బాబూ !' అని వూతపదం ఒకటి వేస్తూవుంటాడు. జాగ్రత్తగా ఆలోచించిచూస్తే ఈవూత పదాలన్నిటికీ అర్థం దొరుకుతుంది. అయితే యీ వెంకన్న ఉపయోగించే ఊతపదానికి అర్థంఏమిటి ? "నేను చెప్పేమాట అక్షరాలా నిజం. అయినప్పటికీ అనకూడదు. అంటే నోటికి సన్మానంచేస్తారు" అనేమో ! లైటులో కిరసనాయిలు అయిపోవడంవల్ల ఆ రోజుకు చదువు పూర్తిచేశాం.

నా రాత్రిబడి ప్రారంభించి అప్పుడే పదిహేను రోజులయింది. జనం కూడా హెచ్చనారంభించారు. మేము అతిశయించిన ఉత్సాహంతో పాఠాలు చెప్పడం ప్రారంభించాం. అందరికీ అక్షరాలు వచ్చేసినై. పేర్లుచెప్పటం మొదలెట్టాం.

రాత్రి $9\frac{1}{2}$ అయింది. శాస్త్రి, నేను మా పాఠాలు చెప్పడం ముగించి కూర్చున్నాం. భాస్కరం పేపరుచదివి వాళ్ళకు వివరంగా చెప్పనారంభించాడు. కానీ భాస్కరానికి వార్తల కంటే ముందు ప్రకటనలు చదవడం యిష్టం. 'బహుమతి' 'కావలెను !' 'ఉచితము' - ఈ శీర్షికల క్రింద ఉన్న ప్రతిప్రకటనను విడిచిపెట్టకండా చదువుతాడు. అవి బడిలోమాత్రం చదివిచెప్పొద్దని అతనిని చాలా సార్లు హెచ్చరించవలిసి వచ్చింది.

భాస్కరం పేపరుతీసి "పంచాయతీలరాజ్యమే కావాలి!" అని చదివి ఇలా అనసాగాడు. "మన పంచాయతీబోర్డు సంగతి ఈ నాయకులకు తెలిసినట్టయితే ఇలా అనివుండేవారు కాదు. ప్రస్తుతం పంచాయతీల పాలనలో వుండే కుళ్లూ స్వార్థం యిక యెందులోనూ కనిపించదు. మా యింటి ముందు దీపం వేయించాలనీ మాకుండీ బాగుచేయించాలనీ ఘోషిస్తారేకాని మన ప్రజలకు అవసరమైనవేమిటి? గ్రామం శుభ్రంగా వుంటున్నదా? లేదా? మనం చేయవలసిన పనులేమిటి అని ఆలోచించే వాళ్లెవరూ లేరు. ప్రతిబోర్డుకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లని కొందరిని నియమించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరంటే చట్టబద్ధంగా నడిపించే ఉద్యోగి అని అర్థం. కానీ వీరు దీపంవుండగానే......"

ఇంతలో లారీ ఒకటి వాయువేగంతో వచ్చి మా బడిముందు ఆగింది. రిజర్వు పోలీసులు బిలబిలలాడుతూ లారీలోంచి దిగి మమ్మల్ని చుట్టుముట్టారు! ఇనస్పెక్టరు మమ్మల్ని సమీపించి "మీరంతా లారీ యెక్కండి!" అన్నాడు.

"ఎందుకు?"

"ప్రజల్ని రెచ్చగొడుతున్నందుకు!" టోపీ సర్దుకుంటూ సమాధానం చెప్పాడు ఇనస్పెక్టరు.

"అనకూడదుగాని బాబూ! యిదంతా ఆ సుబ్బయ్యగారు......"

"ఛప్! యెక్కు!" లాఠీ ఛెళ్ మంది.

# అవనీమాతవలె....

ఈ వార్త నిజమే. సరోజినీదేవి మరణం! ప్రపంచంలో జరిగే అనేక సంఘటనలతో బాటు ఆమె కాలధర్మాన్ని కూడా పత్రికలు యథావిధిగా ప్రకటించాయి. కాని ఇది అంతగా విశ్వసించనక్కరలేని వార్త. సరోజినీదేవి ఫలానా రోజున జన్మించి ఫలానా తేదీని మరణించిందని చావుపుట్టుకల జాబితా వేసుకోవడానికి మాత్రం పనికొస్తుంది ఈ వార్త. అజరామరమైన సరోజినీదేవి జీవితగాథకి భౌతికమరణం ఒక అశ్వాసాంతం కానేకాదు. పత్రికలు ప్రకటించిన వార్తనికాదని ఖండించకుండా, ఆమె ఇంకా జీవిస్తూనే ఉందని ఖండితంగా చెప్పవచ్చు.

ఆమె చిత్రపటాన్ని కూడా అన్ని పత్రికలూ ప్రకటించాయి. ఆ బొమ్మని చూసినవాళ్ళందరూ సరోజినీదేవికి ముసలితనం వచ్చిందని భ్రమపడవచ్చు. ఆబొమ్మ ఇచ్చే సాక్ష్యంలో కూడా అబద్ధంలేదు. స్థూలదృష్టికి సరోజినీదేవి వృద్ధురాలుగానే కనపడవచ్చు. ఆ సత్యాన్నే కెమేరా రికార్డు చేసింది. అయితే అంతకన్న అగాధమైన సత్యం ఇంకొకటి ఉంది. అది అసలు వయస్సే లేని ఆమె ఆత్మ. ఎవరూ దాని నిప్పటికీ ఫొటో తియ్యలేదు. కాని అందరి మనస్సులలోనూ అది హత్తుకుపోయిందని చెప్పవచ్చును.

ఫొటోలోకి చూస్తూ, పత్రికా వార్త చదువుతూ ఒక ఆరముగ్గిన పండు రాలిపోయిందని అనుకుంటాము జననం 1879, మరణం 1949. డెబ్భయి సంవత్సరాల జీవితం అని లెక్క వేసుకుంటాము. ఈ లోపున ఆమె జీవితంలోని ప్రధాన ఘట్టాలన్నింటినీ ఒక్కసారి స్మరణకి తెచ్చుకుంటాం. పదమూండో యేటనే పద్యం రాయడం, బ్రాహ్మణేతరునితో వివాహం, సాంస్కృతిక సాంఘిక రాజకీయరంగాలలో దేదీప్యమాన విహారం, కాంగ్రెస్ కిరీటం, చెరసాలలు, గూండ్రబల్లలు, ఉప్పు సత్యాగ్రహం, ప్రపంచయుద్ధం రావడం పోవడం, స్వరాజ్యం రావడం, గవర్నరు పదవి ఇత్యాదులు. ఇటీవల ఆమె పరమపదించిందన్న వార్త ఆమె జీవితగాథలో అంతగా పాటించనక్కరలేని ఒక చిల్లర వివరం.

అందంగా, ఆకుపచ్చగా అవనీమాతలాగ సరోజినీదేవి శాశ్వతంగా మనలోనే ఉంటుంది.

శ్రీ. శ్రీ